సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



బాధితుడికి మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.42 వేలు మంజూరు పత్రాలను పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ సోమవారం అందజేశారు. శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీకి చెందిన తొట్ల ప్రకాష్‌కుమార్‌కు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కెఆర్‌కె రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేత



ఆటోడ్రైవర్లకు యూనిఫాంను అందజేసిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డా. వంశీరెడ్డి, తదితరులు

ఆల్విన్‌కాలనీ: వేసవిని పురస్కరించుకుని శ్రీమాతా ఆటో యూనియన్ అభ్యర్థన మేరకు ఎస్‌సీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, బీజేపీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వంశీరెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆటోడ్రైవర్లకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు రెప్పన రాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ పట్టాభిషేకం



కూకట్‌పల్లి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లిలోని రామాలయంలో సోమవారం శ్రీరాముడి పట్టాభిషేకం చేశారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గూడెపు నాగరాజు, మేకల రమేష్, మాధవరం శ్రీనివాసరావు, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్, శివా చౌదరి, సంజీవరావు, కృష్ణవేణి, జ్యోతి పాల్గొన్నారు. అలాగే పట్టాభిరాముని ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సతీమణి మాధవరం లక్ష్మీబాయి, చైర్మన్ తులసిరావు దంపతులు, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని ఈస్ట్ సాయిన గర్‌లో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం లవకుశ నాటకం ప్రదర్శించారు. సుమారు 50 మంది కళాకారులను సురభి రమేష్‌రావు శాలువాలతో సన్మానించి, షీల్డ్‌లను ప్రదానం చేశారు.

ఎయిర్ వాల్వ్ వద్ద అపరిశుభ్రత



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మిషన్ భగీరథ పైప్‌లైన్‌పై ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ వద్ద పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోయి అపరిశుభ్రత నెలకొంది. రామచంద్రాపురంలో ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ గేట్‌ను ఆనుకొని మిషన్ భగీరథ పైప్‌లైన్‌పై ఎయిర్‌వాల్వ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ మురుగు నిలవడంతో పాటు స్థానికులు చెత్తను వేస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేటు వాహనాల పార్కింగ్.. చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం సంత ప్రాంగణం ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారుతుంది. భారీ వాహనాలను సంత ప్రాంగణంలో దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. గతంలో వర్షాలు పడినప్పుడు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో అధికారులు లక్షలాది రూపాయలతో సీసీ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ వాహనాల పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కళలకు వేదిక

శిక్షణలో మేటి సీసీఆర్టీ .. సంవత్సరానికి 50 కార్యక్రమాలు • మేలో ఇంద్రధనస్సు క్యాంపు ప్రారంభం

- ఉపాధ్యాయులు, కళాకారులు ఉండడానికి 45 గదులు
- సంగీతం, నృత్యం, సంస్కృతికి సంబంధించి 3వేల పుస్తకాలతో లైబ్రరీ



మాదాపూర్‌లోని సీసీఆర్టీ ప్రధాన ద్వారం

మాదాపూర్: సంగీతం, నృత్య కార్యక్రమాలను ప్రోత్సహించే మల్టీడిసిప్లినరీ స్పేస్‌గా మాదాపూర్‌లో సీసీఆర్టీని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఇంద్రధనస్సు పేరిట చిన్నారులకు సమ్మర్ క్యాంపును నిర్వహించనున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 6 నుండి 9వ తరగతి చదువుతున్న చిన్నారులు ఈ క్యాంపులో పాల్గొని వివిధ అంశాలలో శిక్షణ పొందనున్నారు. సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ ట్రెనింగ్ సెంటర్ (సీసీఆర్టీ)ని మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో నాలుగు ఎకరాల స్థలంలో నిర్మించారు. భారతదేశంలోని నాలుగు ప్రాంతీయ కేంద్రాలలో ఒకటిగా స్థాపించబడింది. ఇది భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వయం ప్రతిపత్తి గల సంస్థ. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ టీచర్లకు సాంస్కృతిక అంశాలపై అవగాహన, శిక్షణ ఇచ్చేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, కళాకారులు ఉండడానికి 45 గదులు ఉన్నాయి. అడ్మినిస్ట్రేటివ్ భవనంలో సంగీతం, నృత్యం, సంస్కృతికి సంబంధించిన 3వేల పుస్తకాలతో కూడిన లైబ్రరీని అందుబాటులో ఉంచారు.

1900 సీట్లతో థియేటర్..

1900 సీట్ల కెపాసిటీ కలిగిన ఓపెన్ ఎయిర్ యాంఫీథియేటర్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంగీతం, నృత్యంతో పాటు నృత్యకారుల అరంగేట్రం, శాస్త్రీయ నృత్యం, సంగీత కచేరీలతో పాటు వార్షిక పండిత్ మోతీరామ్ పండిత్ మణిరామ్ సంగీత్ సమరోహ్ను ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అలాగే రామాయణ కల్పవృక్షం తదితర కార్యక్రమాలతో సందర్శకును ఆకట్టుకుంటున్నారు.



యాంఫీ థియేటర్

సమ్మర్ క్యాంపు..

సమ్మర్ క్యాంపులో చిన్నారులకు పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై , అప్లిక్యూ ఆర్ట్, పేపర్ క్రాఫ్ట్‌లతో పాటు కూచిపూడి డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, మూమెంట్, మైమ్, ఫొటోగ్రఫీ, క్లాసికల్ పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

◆ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు. కేవలం చిన్నారులే కాకుండా పెద్దలు సైతం ఒత్తిడిని తగ్గించుకునేందుకు పోటరీ, పెయింటింగ్‌లను నేర్చుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.





అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదురుగా గార్డెన్

ప్రజావాణి... 8 ఫిర్యాదులు

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 7 వినతి పత్రాలు అందగా టౌన్‌ప్లానింగ్ 2, రెవెన్యూ 4, ఇంజనీరింగ్ 1 ఫిర్యాదు అందాయి. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఏసీపీ నాగిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, డీఈ దుర్గాప్రసాద్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో రెవెన్యూ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, సంజయ్, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏసీపీ నాగిరెడ్డి

హెచ్‌సీయూ విద్యార్థినికి 'బెస్ట్ రిప్లై అవార్డు'



అవార్డు అందుకుంటున్న హెచ్‌సీయూ విద్యార్థిని లాస్యప్రియ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పోస్టుగాడ్యుయేషన్ విద్యార్థిని లాస్యప్రియ ఉత్తమ ప్రత్యుత్తర అవార్డు (బెస్ట్ రిప్లై అవార్డు) అందుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగంలో లాస్యప్రియ ఐఎంఏ చదువుతోంది. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్-2025లో ఈ అవార్డు అందుకుంది. జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జరిగిన అన్ని స్థాయిలలో ప్రతిభ చాటింది. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ స్థలం.. వ్యర్థాలమయం



ప్రభుత్వ భూమిలో పారబోసిన నిర్మాణ వ్యర్థాలు

మణికొండ: ప్రభుత్వ భూములపై అధికారుల పర్యవేక్షణ లేక డంపింగ్ యార్డులకు నిలయాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు భారీ భవనాల నిర్మాణ వ్యర్థాలను లారీల్లో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. అంతేకాక భారీగా చెత్తకుప్పలను సైతం తీసుకొచ్చి పారబోస్తున్నారు. గండిపేట మండలం, కోకాపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 144లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాని పక్కన ఓ పేరున్న నిర్మాణ సంస్థ పనులను కొనసాగిస్తుంది. అక్కడి వరకు బాగానే ఉన్నా వారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్నారు. అది దుమ్ము, ధూళి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలోకి చేరి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఇటీవల ఎలాగో ప్రభుత్వ భూమిలో గుట్టలుగా మట్టి చేరిందనే ఉద్దేశంతో కొందరు అందులో చెత్తను సైతం వేయడం మొదలుపెట్టారు. పేరుకుపోతున్న చెత్తలో నుంచి పుట్టైన దుర్వాసన వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'ప్రజావాణి ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు'



అధికారులతో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్‌లో ప్రజావాణి ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది బడా బిల్డర్లు కోర్టు నుంచి స్టేటస్ కో తీసుకువచ్చి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వీటిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విన్నవించారు.

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- పటాన్‌చెరు తిమ్మక్క చెరువు, ముత్తంగి ఎంక చెరువుల అభివృద్ధి
- రూ.10 కోట్ల 78 లక్షల రూపాయలతో సుందరీకరణ పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామ పరిధిలోని ఎంక చెరువులను హెచ్‌ఎండీఏ ద్వారా 10 కోట్ల 78 కోట్ల లక్షల రూపాయలతో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రెండు చెరువుల వద్ద సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు ముత్తంగి పరిధిలో ప్రజలు సేద తీరేలా చెరువుల సుందరీకరణ చేపడుతున్నామని తెలిపారు. ప్రతి చెరువు కట్ట పైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిధులు సరిపోని పక్షంలో సీఎస్ఆర్ ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామకృష్ణ, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, తెల్లాపూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్

మున్నూరు కాపు సంఘం పాలక మండలి ప్రమాణస్వీకారం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. డివిజన్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో నూతన అధ్యక్షుడిగా నాయికోటి భోజయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులు చేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భోజయ్య మాట్లాడుతూ... మున్నూరు కాపు కుల సంఘ సభ్యులలో ఎవరైనా అకాల మరణం చెందితే, గతంలో రూ.10 వేలకే పరిమితమైన దహన సంస్కారాల ఆర్థిక చేయూతను రూ .21 వేలు అందించేలా నూతన కార్యవర్గం ఆమోదించింది. నిరుపేద ఆడబిడ్డ కల్యాణానికి పుస్తెలు, మెట్టెలు ఇస్తామని చెప్పారు. నూతన కార్యవర్గంలో.. ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్, ముఖ్య సలహాదారుడిగా నర్ర బిక్షపతి, గౌరవ సలహాదారులుగా శంకర్, పెంటయ్య, కోశాధికారిగా మహేందర్, సహాయ కోశాధికారిగా మేకల శివకుమార్ ఉపాధ్యక్షులుగా జీతయ్య, యాదయ్య ,నర్ర రామారావు, అశోక్ , గాదె సుధాకర్, యంజాల మల్లేష్, కార్యదర్శులుగా కొడకంచి భార్గవ్, మేకల జగదీష్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

సన్న బియ్యం పంపిణీతో దేశానికే ఆదర్శం

కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



నెహ్రూనగర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి: రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్‌లోని రేషన్ దుకాణంలో సోమవారం ఆయన సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీరేశంగౌడ్, వార్డు మెంబర్ పర్వీన్ బేగం, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, నాయకులు యాదాగౌడ్, కెఎస్ రాములు, రవీందర్‌గౌడ్, గోపాల్‌యాదవ్, శ్రీకాంత్, కుమార్, రంజిత్ పాల్గొన్నారు.

కాలనీ మధ్య నుండి నాలా వద్దంటూ నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

మియాపూర్: మా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నాలా పనులను ఆపివేయాలని ఎఫ్‌సిఐ కాలనీ, టీఎస్‌నగర్, వీడియో కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల మధ్య నుండి నాలా, మురుగుకాలువ ఏర్పాటును ఆపాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ...ఎఫ్‌సిఐ కాలనీ, టీఎస్‌నగర్, వీడియో కాలనీ మధ్యలో నుండి పటేల్ చెరువుకు వెళ్లే నాలా, మురుగు కాలవ పనులు ప్రారంభమయ్యాయని పనులను తక్షణమే ఆపివేయాలన్నారు. మియాపూర్ గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలా, మురికి నీటి కాల్వ పనులను చేపడుతున్నారన్నారు. గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు ఉన్న నాలాను విస్తరించాలన్నారు. కార్యక్రమంలో వీడియో కాలనీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు సమ్మెట ప్రసాద్, జగన్, శ్రీనివాస్, రావు, సుప్రజ, రమేష్, శ్రీను, మహేందర్‌గౌడ్, హనీఫ్‌పటేల్, తాండ్ర రామచందర్, శశికాంత్, వెంకటేశ్వర్లు, సాయి, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



తారానగర్ ప్రైమరీ స్కూల్‌లో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, స్మిత డెంటల్ క్లీనిక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో తారానగర్ వీకర్ సెక్షన్ కాలనీ ప్రైమరీ స్కూల్‌లో ఉచిత దంత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రెండుసార్లు బ్రష్ చేయాలని, ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన మందులతోపాటు పేస్ట్, బ్రష్‌లను అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు' అనే నినాదంతో తల్లి, పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో సోమవారం తల్లి, పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 60 మంది చిన్నారులకు, 40 మంది పెద్దలకు హెచ్‌పివి వాక్సిన్ ఉచితంగా అందించారు. ఆసుపత్రి యాజమాన్యం విక్రందేవ్‌రావ్, మీరా రావ్, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావ్, హాస్పటల్ ఎండి డాక్టర్ కె. కమలాకర్‌రావు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలి

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



నానక్‌రాంగూడలో జెండా ఎగుర వేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయదుర్గం: పార్టీకి పట్టుకొమ్మలు కార్యకర్తలేనని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో సోమవారం రాత్రి బీజేపీ బూత్‌స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్‌కళ్యాణ్, కిసాన్ సమ్మాన్‌నిధి, ముద్ర యోజన, అటల్ పెన్షన్ యోజన, అగ్నిపథ్ వంటి వాటి గురించి ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, కోకన్వీనర్ మణిభూషణ్, మహిళా మోర్చా నాయకురాలు వరలక్ష్మీ, నాయకులు మీనలాల్‌సింగ్, స్వామిగౌడ్, నరేందర్ ముదిరాజ్, నరేందర్‌గౌడ్, తిరుపతి, రాజు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎలా నడవాలి సారూ..!

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌లు ఫ్లెక్సీలకు అడ్డాగా మారాయి. పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఫ్లెక్సీలను ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు, ఇతర పాదచారులు ఫ్లెక్సీలను దాటుకుని ముందుకు వెళ్లలేక రోడ్డును ఆశ్రయిస్తున్నారు. కొంతకాలంగా కేబీఆర్ పార్కు ముందు ఇష్టానుసారంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఒకవైపు ఫుట్‌పాత్‌లపై, మరో వైపు రోడ్డును ఆక్రమించి ఈ ఫ్లెక్సీలు రోజుల తరబడి ఏర్పాటు చేస్తున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో రెండు వారాల వరకు ఇవి అలాగే ఉండిపోతుండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఫ్లెక్సీలు కూలిపోకుండా వైర్లతో ఫుట్‌పాత్‌పై వేసిన దిమ్మెలకు, ఫెన్సింగ్‌కు కడుతున్నారు. దీంతో అటు నుంచి నడుచుకుంటూ వచ్చేవారికి ఈ వైర్లు కనిపించకపోవడంతో కిందపడుతున్నారు. జీహెచ్ఎంసీకి స్పష్టమైన వైఖరి లేకపోవడంతో ఫ్లెక్సీల ఏర్పాటుకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిలో పడాలనే ఉద్దేశ్యంతో చాలామంది కేబీఆర్ పార్కు, జూబ్లీ హిల్స్ చెక్‌పోస్టు వద్ద అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వద్ద ఫ్లెక్సీ రహిత ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలని వాకర్లు డిమాండ్ చేస్తున్నారు.

సార్.. మా డబ్బులివ్వండి!



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల, సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే డేటాను అప్‌లోడ్ చేసిన వారికి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవటంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గతేడాది నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ మొదటి వారం వరకు అంతకు ముందు చేసిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం వద్ద సరిపడ సిబ్బంది లేకపోవటంతో సర్వే చేసేందుకు వచ్చిన వారికి ఒక్కో ఇంటికి రూ. 25, డేటాను ఎంట్రీ చేసిన వారికి ఒక్కో ఇంటికి రూ.15 చొప్పున చెల్లిస్తామని తెలిపారు. దాంతో కొంత మంది మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఏజెన్సీల రూపంలో కొందరు, వ్యక్తిగతంగా మరి కొందరు ముందుకొచ్చారు. వారు వందల సంఖ్యలో అప్లికేషన్ల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంటింటికి తిరిగి సర్వే చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డబ్బులు ఇవ్వగా,డేటా ఎంట్రీ చేసిన వారి విషయం మాత్రం పట్టించుకోలేదు. దాంతో డేటా ఆపరేటర్లు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సోమవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను కొంతమంది కలిసి తమ డబ్బులు ఇప్పించాలని ప్రాధేయపడ్డారు. దాంతో ఆయన రాష్ట్ర ప్రభుత్వమే డబ్బులను ఇవ్వాలని, లేదంటే తమ మున్సిపాలిటీల నుంచి చెల్లించమని ఆదేశాలైనా ఇస్తే డబ్బులు ఇస్తామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.